PRGI No: TGBIL/25/A0946

# విశాలజ్యోతి

సమగ్ర తెలుగు దినపత్రిక

approved by Govt of INDIA, TELANGANA
DK MEDIA
OUR SERVICES
* NEWS PAPER * DK ADS & PROMOTIONS
* NEWS CHANNEL * DK PRINTERS
* DK GRAPHICS * DK PUBLICATIONS
WE'RE HIRING REPORTERS
for more details 9440711117, www.vishalajyothi.com

వరంగల్ సంపుటి : 02 సంచిక : 27 మంగళవారం, ఆగస్టు 25 2026, పేజీలు - 4 వెల : 5 రూ/-

## సీఎం రేవంత్‌తో భట్టి విక్రమార్క భేటీ

### - కొండా సుస్మిత, చిన్నారెడ్డిల అంశంపై చర్చ!



హైదరాబాద్: లండన్ పర్యటన ముగించుకుని హైదరాబాద్ చేరుకున్న సీఎం రేవంత్ రెడ్డిని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కలిశారు. అమెరికా పర్యటనకు కేంద్రం నిరాకరణ, తాజా రాజకీయ పరిణామాలపై చర్చించినట్లు సమాచారం. వీటితో పాటు కొండా సుస్మిత, చిన్నారెడ్డిల అంశాలపై మాట్లాడినట్లు తెలిసింది. పెట్టుబడులే లక్ష్యంగా 3 రోజుల పాటు లండన్‌లో పర్యటించిన సీఎం విదేశీ పర్యటన విజయవంతంగా ముగించుకుని భారత్‌కు చేరుకున్నారు. ఈ ఉదయం శంషాబాద్ ఎయిర్ పోర్ట్‌కు చేరుకున్న ముఖ్యమంత్రికి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు భారీగా చేరుకొని ఘన స్వాగతం పలికారు.మద్దతు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి ధన్యవాదాలు : రాజకీయ అంశాలపై హైదరాబాద్ వచ్చిన తర్వాత అన్ని మాట్లాడతానని సీఎం రేవంత్ రెడ్డి ఆదివారం ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. మూడ్రోజుల లండన్ పర్యటన ముగించుకున్న సీఎం రేవంత్‌రెడ్డి ఈరోజు ఉదయం హైదరాబాద్‌కు చేరుకున్నారు. అమెరికా పర్యటనకు కేంద్ర ప్రభుత్వం అనుమతి నిరాకరించిన అంశంపై బలమైన మద్దతు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. దేశ ప్రయోజనాల కోసం ఈ విషయంలో అండగా నిలిచిన పార్టీ, నాయకులు, ప్రజలకు కృతజ్ఞతలు అంటూ రాసుకొచ్చారు.రాజకీయ కారణాలతోనే ఆపేశారు : లండన్‌లో షెడ్యూలు ప్రకారం సమావేశాలు, కార్యక్రమాలను ముగించినట్లు సీఎం తెలిపారు. ముందస్తు షెడ్యూలు ప్రకారం బోస్టన్‌కు వెళ్లాల్సి ఉండగా కేంద్ర ప్రభుత్వం రాజకీయ కారణాలతో అమెరికా పర్యటనకు పర్మిషన్ ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ నూతన విద్యావిధానంలో భాగంగా ప్రపంచంలోని అత్యుత్తమ సంస్థలను తెలంగాణకు తీసుకురావడమే ఈ పర్యటన ముఖ్య ఉద్దేశమని చెప్పారు. ఐవీలీగ్, ప్రపంచ అత్యున్నత సంస్థల నుంచి విద్య, నైపుణ్యాలు, శిక్షణ పొందాలనే యువత ఆకాంక్షలకు ఈ పర్యటన సమాధానంగా నిలిచేదన్న సీఎం రేవంత్ రెడ్డి దేశ నిర్మాణం, యువత భవిష్యత్తుపై రాజకీయాలకు అతీతంగా ఆలోచించాలని సూచించారు. తెలంగాణ కాంగ్రెస్?లో నేతల తీరుపై చర్చించి నేడు ఓ నిర్ణయానికి రానున్నట్లు తెలుస్తోంది.

## దివ్యాంగ వధువులకు తెలంగాణ హైకోర్టు గుడ్ న్యూస్




హైదరాబాద్, ఆగస్టు 24: తెలంగాణ హైకోర్టులో రాష్ట్ర ప్రభుత్వానికి స్వల్ప ఊరట లభించింది. ప్రభుత్వం అమలు చేస్తున్న కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ పథకాల కింద దివ్యాంగ వధువులకు అందిస్తున్న అదనపు సాయాన్ని కొనసాగించేందుకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో వీరికి ఈ పథకాల వర్తింపుపై విధించిన స్టేను హైకోర్టు సోమవారం ఎత్తివేసింది. దివ్యాంగులకు మినహా మిగిలిన వారికి ఈ రెండు పథకాలపై విధించిన స్టే కొనసాగుతోందని స్పష్టం చేసింది. అయితే దీనిపై వాదనలు వినిపించడానికి రాష్ట్ర ప్రభుత్వం రెండు వారాల గడువు కోరింది.ఈ పథకాల కింద సాధారణ లబ్ధిదారులతో పోలిస్తే దివ్యాంగ వధువులకు 25 శాతం అదనంగా ఆర్థిక సాయం అందించేలా గతంలో ప్రభుత్వం జీవో జారీ చేసింది. సోమవారం ఈ పథకాల అమలుపై దాఖలైన పిటిషన్లపై విచారణ జరిగింది.

### కొండా సురేఖ అంశం..

## ఆ రిపోర్టు వచ్చాకే నిర్ణయం



మెదక్, ఆగస్టు 24: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కొండా సుస్మిత వ్యాఖ్యలపై మంత్రి కొండా సురేఖ స్పందించిన తీరు ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో చర్చనీయాంశంగా మారింది. కొండా సురేఖపై చర్యలు తీసుకోవాలని పార్టీ నేతలు పట్టుబడుతున్న పరిస్థితి. ఈ నేపథ్యంలో సురేఖ అంశంపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ స్పందించారు. (సోమవారం) మెదక్ హౌసింగ్ బోర్డులోని వినాయక ఫంక్షన్ హాల్లో నిర్వహించిన ఉమ్మడి మెదక్ జిల్లా గ్రామ సమావేశంలో టీపీసీసీ చీఫ్ మాట్లాడుతూ.. కొండా సురేఖ అంశాన్ని క్రమశిక్షణ కమిటీ పరిశీలిస్తోందని చెప్పారు. ఇప్పటికే ప్రిలిమినరీ రిపోర్ట్‌నుఅందజేశామని.. డిటైల్డ్ రిపోర్ట్ వచ్చాక పెద్దలు ఈ అంశంపై నిర్ణయం తీసుకుంటారని వెల్లడించారు.కాంగ్రెస్ పెద్ద పార్టీ కాబట్టి చెప్పుకునే స్వేచ్ఛ ఎక్కువ ఉంటుందని మహేశ్ తెలిపారు. స్వేచ్ఛ హద్దులు దాటితే క్రమశిక్షణ చర్యలు తప్పవని.. తనతో సహా అందరూ హద్దులో ఉంటే మంచిదన్నారు. ప్రతి కుటుంబంలో సమస్యలు ఉన్నట్టు కాంగ్రెస్ కుటుంబంలో కూడా ఉంటాయన్నారు. 'కష్టపడ్డ కాంగ్రెస్ కార్యకర్తకు న్యాయం జరుగుతుంది.. ఇది సీఎం మాట, నా మాట, మీనాక్షి నటరాజన్ మాట. ఎవ్వరికీ కూడా 100 శాతం న్యాయం చేయలేం.. నేను వాస్తవాలు మాట్లాడతా. 70 శాతం పదవులు పాత కాంగ్రెస్ నాయకులకే దక్కేలా అధిష్ఠానం హామీ ఇచ్చింది. ములుగులో మంత్రి సీతక్క పాత నాయకులకే పదవులు ఇచ్చారు' అని తెలిపారు.

### విజయ్ సర్కార్

## భారీ ప్రకటనలు

### ఏడాదికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు




తమిళనాడు అసెంబ్లీలో ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ సోమవారం పలు కీలక సంక్షేమ పథకాలను ప్రకటించారు. ఏడాదికి మూడు ఉచిత ఎల్‌పీజీ సిలిండర్లు అందించే పథకంతో పాటు ట్రాన్స్‌జెండర్లకు ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం కల్పించనున్నట్లు తెలిపారు.'అన్నపూర్ణి సూపర్ సిక్స్' పేరుతో గ్యాస్ సిలిండర్ల పథకం అమల్లోకి రానుంది. 2027 సంక్రాంతి నుంచి దీనిని ప్రారంభించనున్నారు. ఏటా రూ.2.5 లక్షల లోపు ఆదాయం ఉన్న కుటుంబాలకు ఈ ప్రయోజనం వర్తిస్తుంది. సుమారు 1.30 కోట్ల కుటుంబాలకు లబ్ధి చేకూరనుంది. అర్హులైన కుటుంబాలు కొనుగోలు చేసే మూడు గ్యాస్ సిలిండర్ల ఖర్చును నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారు. ఈ పథకానికి ఏటా సుమారు రూ.4,000 కోట్ల వ్యయం అవుతుందని ప్రభుత్వం అంచనా వేసింది. గల్ఫ్ ప్రాంతంలో కొనసాగుతున్న యుద్ధ పరిస్థితులతో గ్యాస్ కొరత, ధరల పెరుగుదల కుటుంబాలపై అదనపు భారాన్ని మోపాయని విజయ్ తెలిపారు.మహిళల ఉచిత బస్సు ప్రయాణ పథకం పరిధిని ప్రభుత్వం విస్తరించింది. ఇకపై సాధారణ బస్సులతో పాటు ఎక్స్‌ప్రెస్, ఎల్ఎస్ఎస్, డీలక్స్ బస్సుల్లోనూ మహిళలు ఉచితంగా ప్రయాణించవచ్చు. జిల్లాల మధ్య నడిచే బస్సుల్లోనూ ఈ సదుపాయం కల్పించనున్నారు. 'వెట్రి పయనం' పేరుతో అక్టోబర్ 2 నుంచి ఈ విస్తరణ అమల్లోకి వస్తుంది. ట్రాన్స్‌జెండర్లకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించనున్నట్లు విజయ్ ప్రకటించారు.

### 22ఏ పై కొత్త కథలు అల్లి ప్రజలను

## భయపెడుతున్న ప్రతిపక్షాలు

- ప్రభుత్వ ఆస్తులు రిజిస్ట్రేషన్ చేయాలని చూస్తే సాధ్యం కాదు
- 22ఏ జాబితాలోనివి, వివిధ ఆర్డర్లలో ఉన్న వివరాలు అప్‌లోడ్ చేశామన్న మంత్రి పొంగులేటి
- స్లాట్లు బుక్ చేసి రిజిస్ట్రేషన్ కాకపోతే వారంలో ఖాతాలో జమ చేస్తామని వెల్లడి




హైదరాబాద్: 22ఏ భూములకు సంబంధించి రిజిస్ట్రేషన్లు ఆగిన వాటిని 24 గంటల్లో క్లియర్ చేశామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వ ఆస్తులు రిజిస్ట్రేషన్ చేయాలని చూస్తే సాధ్యం కాదన్నారు. మేడ్చల్‌లోని భూధాన్ భూముల్లో వాటిని తిరస్కరించామని వెల్లడించారు. స్లాట్లు బుక్ చేసి రిజిస్ట్రేషన్ కాకపోతే వారంలో ఖాతాల్లో జమ చేస్తామన్నారు. ఈనెల 18 నుంచి ట్రోల్‌ఫ్రీ నంబర్‌కు 1162 కాల్స్ వచ్చాయని, వాటిని జిల్లాల వారిగా పంపించినట్లుగా పొంగులేటి తెలిపారు. ప్రైవేటు ఆస్తులవి కాకుండా ప్రభుత్వ ఆస్తులకు సంబంధించిన సమస్యలే ఎక్కువగా ఉన్నాయన్నారు. ప్రతి సోమవారం ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించి 22ఏ జాబితా లోనివి, వివిధ ఆర్డర్లలోని ఉన్న వివరాలు అప్‌లోడ్ చేస్తామన్నారు. ప్రభుత్వ ఆస్తులు రిజిస్ట్రేషన్ సాధ్యం కాదు : ప్రభుత్వ ఆస్తులు రిజిస్ట్రేషన్ చేయాలని చూస్తే సాధ్యం కాదని వివరించారు. మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లో సీఎస్7,14కు సంబంధించిన వివాదాలు ఉన్నాయని, భూములకు సంబంధించి ప్రభుత్వ, ప్రైవేటు వ్యక్తుల మధ్య వివాదం ఉందన్నారు. సీఎస్ 7, 14కు సంబంధించి గతంలో రేవంత్ రెడ్డి పోరాడారని పొంగులేటి గుర్తుచేశారు. 22ఏకి సంబంధించి రిజిస్ట్రేషన్లు ఆగిన వాటిలో 24 గంటల్లో క్లియర్ చేశామని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఎక్కడైనా ఒకటి రెండు ఆగిపోతే ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అధికారుల సంతకాలు పోర్జరీ చేసి రిజిస్టేషన్లు చేయాలని లేఖలు రాస్తున్నారన్నారు. నిందితులను గుర్తించి కేసులు నమోదు చేయాలని ఆదేశించామని ఆయన వెల్లడించారు.

### ఖరగ్‌పూర్--అమరావతి

## హైవేకు గ్రీన్ సిగ్నల్.



ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి తూర్పు భారతదేశంతో రవాణా అనుసంధానాన్ని మరింత పటిష్ఠం చేసేలా పశ్చిమ బెంగాల్‌లోని ఖరగ్‌పూర్ నుంచి అమరావతి వరకు 1,107 కిలోమీటర్ల సుదీర్ఘ గ్రీన్‌ఫీల్డ్ హైవే కారిడార్‌కు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు ఆమోదం లభించినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎక్స్ వేదికగా వెల్లడించారు. ప్రధాని మోదీ, కేంద్ర రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీలకు ఏపీ ప్రజల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మొత్తం 1,107 కిలోమీటర్ల పొడవైన ఈ నాలుగు లేన్ల కారిడార్ పశ్చిమ బెంగాల్, ఝార్ఖండ్, ఒడిశా రాష్ట్రాల మీదుగా సాగి ఏపీలోకి ప్రవేశిస్తుంది. మన రాష్ట్రంలో దాదాపు 457 కిలోమీటర్ల మేర అమరావతికి చేరుకునేలా ప్రణాళికలు రూపొందించారు. ఈ హైవే అందుబాటులోకి వస్తే తూర్పు భారతదేశం - ఆంధ్రప్రదేశ్ మధ్య అధిక వేగంతో ప్రయాణికుల, సరుకుల రవాణా వేగవంతం కానుంది. దీనివల్ల రవాణా వ్యయం గణనీయంగా తగ్గి ఏపీలోని రైతులు, పరిశ్రమలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని సీఎం అభిప్రాయపడ్డారు. వ్యాపార, వ్యవసాయ రంగాలతో పాటు పారిశ్రామికాభివృద్ధి, కొత్త ఉపాధి అవకాశాలకు ఈ కారిడార్ ఊతమిస్తుందని భావిస్తున్నారు.

## తెలంగాణలో భారీ వర్షాలు


### పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్



హైదరాబాద్, ఆగస్టు 24: తెలంగాణలో రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్‌లోని వాతావరణ కేంద్రం వెల్లడించింది. నేడు, రేపు ఉత్తర తెలంగాణ జిల్లాల్లో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని పేర్కొంది. ఈ నేపథ్యంలో ఆయా జిల్లాల్లోని అధికారులను ప్రభుత్వం అప్రమత్తం చేసింది. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. భారీ హోర్డింగులు, పెద్ద వృక్షాల వద్ద నిలబడవద్దని ప్రజలకు సూచించింది. అవసరమైతేనే ఇళ్ల నుంచి బయటకు రావాలని ప్రజలకు స్పష్టం చేసింది.ఇక రాష్ట్రంలోని పలు జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట, కామారెడ్డి, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, హన్మకొండ, వరంగల్, జనగాం, మహబూబాబాద్, నాగర్ కర్నూల్, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో గంటకు 40 కిలోమీటర్ల వేగంగా ఈదురుగాలులు వీస్తాయని వెల్లడించింది. ఉరుము మెరుపులతో వర్షాలు కురుస్తాయని వివరించింది. ఉండాలని ప్రజలకు సూచించింది. హైదరాబాద్ మహానగరంలో గత రెండు రోజులుగా ఆకాశం మేఘావృతమై ఉంది. పలు ప్రాంతాల్లో ఎడతెగకుండా వర్షాలు కురుస్తున్నాయి.

### జాబ్ నోటిఫికేషన్లు నిల్..

## లిక్కర్ నోటిఫికేషన్లు మాత్రం ఫుల్



హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం కొత్తగా 121 రకాల మద్యం బ్రాండ్లకు నోటిఫికేషన్ ఇవ్వడంపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రంగా స్పందించారు. రాష్ట్రంలో ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు ఇవ్వకుండా.. మద్యం బ్రాండ్లకు మాత్రం నోటిఫికేషన్లు జారీ చేస్తున్నారంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు.'జాబ్ నోటిఫికేషన్లు నిల్.. లిక్కర్ నోటిఫికేషన్లు మాత్రం ఫుల్' అంటూ హరీశ్ రావు ఎద్దేవా చేశారు. యువత భవిష్యత్తుకు భరోసా కల్పించాల్సిన ప్రభుత్వం ఉద్యోగాల భర్తీపై దృష్టి పెట్టకుండా మద్యం వ్యాపారంపై ఎందుకు అంత ఆసక్తి చూపుతోందని ప్రశ్నించారు.రాష్ట్రంలో నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారని, వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని హరీశ్ రావు పేర్కొన్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం లిక్కర్ అమ్మకాలపైనే ఎక్కువ శ్రద్ధ చూపుతోందని ఆయన ఆరోపించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ప్రభుత్వ తీరుపై విమర్శలు చేశారు.

# పాలిటెక్నిక్ విద్య ప్రత్యేకతను కాపాడండి

**హనుమకొండ, విశాలజ్యోతి:**
సాంకేతిక విద్యలో 103 సంవత్సరాలుగా తన ప్రత్యేకతను నిలుపుకుంటూ లక్షలాది విద్యార్థులు అభ్యసించిన పాలిటెక్నిక్ విద్యను శక్తి విభాగంలో విలీనం చేయటానికి విడుదల చేసిన జీవో నెంబర్ 97 ని ఉపసంహ రించుకొని ఎస్ బి టిఈటిని యధాతథంగా కొనసాగిస్తూ పాలిటెక్నిక్ విద్యను మరింత బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ప్రజావేదిక రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరునహరి శేషు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ ద్వారా విజ్ఞప్తి చేసినారు. ఐఐటి ఏటీసీ లు మరియు పాలిటెక్నిక్ డిప్లమా కోర్సులను ఒకే గొడుగు కింది కి తీసుకొచ్చి స్కిల్ యూనివర్సిటీ ద్వారా నిర్వహించాలనే ప్రభుత్వ ఆలోచన వలన పాలిటెక్నిక్ విద్య ప్రాధాన్యత, స్థాయి తగ్గే అవకాశాలు ఉన్న నేపథ్యంలో విద్యార్థులు ఉద్యోగులు మీ ప్రతిపాదన పట్ల అసంతృప్తి వ్యక్తం



చేస్తున్న నేపథ్యంలో పాలిటెక్నిక్ విద్యను బలోపేతం చేయడానికి ఉద్యోగ ఉపాధి అవకాశాలను మెరుగుపరచడానికి ప్రభుత్వ ఆధ్వర్యంలోని 61 పాలిటెక్నిక్ కళాశాలలతో పాటు ప్రైవేట్ రంగంలో ఉన్న 65 పాలిటెక్నిక్ కళాశాలలను కూడా ప్రభుత్వ కళాశాలలుగా మార్చి మౌలిక వసతుల కల్పనతో పాటు అధ్యాపక నియామకాలు చేపట్టటం ద్వారా పాలిటెక్నిక్ విద్యను బలోపేతం చేయాలని అభిప్రాయపడినారు.ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంలో ఉన్న స్కిల్ యూనివర్సిటీ పరిధి లోకి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను తీసుకురావడం అంటే భవిష్యత్తులో పాలిటెక్నిక్ విద్యను కూడా ప్రైవేట్ పరం చేసే ఆలోచన ప్రభుత్వానికి ఉన్నట్లుగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పాలిటెక్నిక్ విద్య ప్రైవేటీకరణ, లెటరల్ ఎంట్రీ, ఫీజులు లాంటి అంశాలపై స్పష్టత ఇవ్వకుండా జీవోను విడుదల చేయటంతో ఆందోళన వ్యక్తం అవుతుంది.ఎస్ఎస్ సి బోర్డు, ఇంటర్ బోర్డు విలీన ప్రతిపాదనలను ఉపసంహరించుకున్నట్లుగానే ఈ విలీన ప్రతిపాదనను కూడా విరమించుకొని పాలిటెక్నిక్ విద్యను బలోపేతం చేసే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు.

# సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ ను
## ప్రారంభించిన మంత్రి శ్రీధర్ బాబు

- హరే కృష్ణ ట్రస్ట్ ఆధ్వర్యంలోమంథనిలో ఏర్పాటు

**పెద్దపల్లి జిల్లా, విశాలజ్యోతి:**
పెద్దపల్లి జిల్లా మంథనిలో ఏర్పాటు చేసిన సెంట్రలైజ్డ్ కిచెన్ ద్వారా 19 మండలాల్లోని 40 వేల మంది విద్యార్థులకు ఉదయం పూట బలవర్తకమైన అల్పాహారం అందించడం జరుగుతుందని ఐటీ పరిశ్రమలు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రివర్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు గారు తెలిపారు.పెద్దపెల్లి జయశంకర్ భూపాలపల్లి జిల్లాల పరిధిలోని 694 ప్రభుత్వ పాఠశాలలు, 17 జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులకు అల్పాహారం ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి శ్రీ దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ పేద విద్యార్థులకు ప్రభుత్వం, హరే కృష్ణ ట్రస్ట్ సంయుక్తంగా బలవర్ధకమైన పౌష్టిక ఆహారం అందించడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులు ఆరోగ్య




ంగా ఉంటూ బాగా చదువుకుని తమ మేధా శక్తిని పెంపొందించుకోవాలని కోరారు. మొదట కొడంగల్ లో ప్రారంభమైన ఈ కార్యక్రమం నేడు మంథని ప్రారంభం కాగా,త్వరలో రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తామని ప్రభుత్వ పాఠశాలలో చదివి పేద విద్యార్థుల కోసం, వారి సంక్షేమం పట్ల కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధితో పనిచేస్తుందని తెలిపారు. ప్రైవేటు పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు నడుస్తున్నాయని ప్రభుత్వ పాఠశాలలో చేరి బాగా చదువుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో హరే కృష్ణ ఫౌండేషన్ ప్రెసిడెంట్ శ్రీ సత్య గౌర చంద్ర దాస స్వామీ జీ ,జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మరియు మంథని మున్సిపల్ చైర్మన్.వైస్ చైర్మన్ కౌన్సిలర్స్ మరియు గౌరవ ప్రజాప్రతినిధులు అధికారులు కాంగ్రెస్ పార్టీ అభిమానులు నాయకులు తదితరులు పాల్గొన్నారు

# యాదవ సంఘ భవనాన్ని సమాజ అభివృద్ధికి వేదికగా వినియోగించాలి

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి.

**మహబూబ్ నగర్, విశాలజ్యోతి:**
మహబూబ్ నగర్ నియోజకవర్గంలోని పోతన్ పల్లి గ్రామంలో ముడా నిధులతో నిర్మించిన యాదవ సంఘం భవనాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అంతకు ముందు గ్రామంలో ఉన్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించిన అనంతరం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించి, లబ్దిదారులకు నూతన గృహ ప్రవేశ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అసంపూర్తిగా ఉన్న యాదవ సంఘ భవనాన్ని పూర్తి చేసుకోవాలని యాదవ సోదరులు, గ్రామ పెద్దలు, నాయకులు కోరిన వెంటనే నిధులు మంజూరు చేయించారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆ నిధులతో ప్రస్తుతం యాదవ సంఘ భవనాన్ని అద్భుతంగా నిర్మించుకోవడం సంతోషంగా ఉందన్నారు. యాదవ సంఘ భవనాన్ని కేవలం భవనంగా కాకుండా, యాదవ సమాజం



ఐక్యతకు, సామాజిక కార్యక్రమాలకు వేదికగా వినియోగించుకోవాలని ఎమ్మెల్యే కోరారు. అందరూ కలిసిమెలిసి అన్ని రకాల కార్యక్రమాలను నిర్వహించుకోవాలని సూచించారు. భవిష్యత్‌లో సంఘానికి అవసరమైన మరిన్ని అభివృద్ధి పనులను పూర్తి చేసేందుకు తాను సిద్ధంగా ఉన్నానని హామీ ఇచ్చారు. యాదవ సమాజ అభివృద్ధితో పాటు కొత్త తరానికి నాణ్యమైన విద్య అందించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆయన యాదవ సంఘ పెద్దలను కోరారు. పిల్లల విద్యాభ్యాసానికి ప్రాధాన్యత ఇచ్చి, భవిష్యత్ తరాలకు మంచి అవకాశాలు కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా యాదవ సోదరులకు శుభాకాంక్షలు తెలి

# కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలి

- టి.యు.సి.ఐ. రాష్ట్ర నాయకులు కొత్తపల్లి రవి

**వరంగల్, విశాలజ్యోతి:**
చెమటలు చిందిస్తూ రెక్కలు ముక్కలు చేసుకొని ఉత్పత్తులు చేస్తున్న కార్మిక వర్గం శ్రమదోపిడి కి గురికాకుండా కనీస వేతనాలు చెల్లించాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టి.యు.సి.ఐ) రాష్ట్ర నాయకులు కొత్తపల్లి రవి డిమాండ్ చేశారు.
సోమవారం ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టి.యు.సి.ఐ) ఆధ్వర్యంలో కనీస వేతనాల చట్టాన్ని అమలు చేయాలని కోరుతూ నేడు వరంగల్ జిల్లా కలెక్టరేట్ లో జాయింట్ కలెక్టర్ జి.సంధ్యారాణి గారికి డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ప్రతినిధి బృందంగా ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా కొత్తపల్లి రవి మాట్లాడుతూ భారతదేశంలో 45 కోట్ల మంది ఉన్న కార్మిక వర్గాన్ని పెట్టుబడిదారుల దోపిడి కోసం బలి పశువులుగా మార్చటానికి లేబర్ కోడ్స్ తీసుకొచ్చారని అన్నారు. తెలం



గాణ రాష్ట్రంలో ప్రజా పరిపాలన అంటున్న ముఖ్యమంత్రి 73 కనీస వేతనాల జీవోలను రద్దుచేసి 6 జీవో పేరుతో కార్మికులకు తీరని ద్రోహం చేపట్టారని అన్నారు. మున్సిపల్ కార్మికులకు ఇస్తున్న జీతాలను తగ్గించటం చట్ట విరుద్ధమని దానికి తగిన మూల్యం చెల్లించక తప్పదని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకు కనీస వేతనాలు చట్టాన్ని అమలు చేసి నెలకు 31,600 రూపాయలు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.
ఈ కార్యక్రమంలో టి యు సి ఐ నగర కార్యదర్శి బోల్ల రమేష్, పాష, మైదం పాణి తదితరులు పాల్గొన్నారు.

# పీహెచ్‌సీని సందర్శించిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి




**వరంగల్ జిల్లా, విశాలజ్యోతి:**
వరంగల్ జిల్లా రాయపర్తి మండల కేంద్రంలోని రైతు వేదికలో లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరంరాయపర్తి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను పాలకుర్తి శాసన సభ్యురాలు శ్రీమతి మామిడాల యశస్విని రెడ్డి సందర్శించారు.ఈ సందర్భంగా ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలను పరిశీలించి, రోగులతో నేరుగా మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితి, చికిత్స వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి మెరుగైన వైద్య సేవలు, అవసరమైన మందులు సకాలంలో అందేలా చర్యలు తీసుకో వాలని వైద్య సిబ్బందికి సూచించారు.ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజలకు నమ్మకం పెరిగే విధంగా నాణ్యమైన వైద్య సేవలు అందిం చాలని, పరిశుభ్రత, సౌకర్యాల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ



**కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా, విశాలజ్యోతి:**
కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని తిర్యాణి మండల కేంద్రంలో, వివిధ గ్రామాలలో లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయగ్రామాల సర్పంచులు మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్మార్ట్ కార్డులతో అక్రమాలు జరగకుండ అర్హులైన ప్రతిఒక్కరికీ సకాలంలో బియ్యం అందుతుందని తెలిపారు. గతంలో రేషన్ విషయంలో ఉన్న ఇబ్బందులు స్మార్ట్ కార్డులతో తొలగిపోతాయని, క్యూఆర్ కోడ్ తో లబ్ధిదారుడి వివరాలు స్పష్టంగా తెలుస్తాయని పేర్కొన్నారు. ఇంకా కార్డులు రానివారు ఆందోళన చెందవద్దని, అర్హులైన వారందరికీ దశల వారీగా కార్డులుఅందజేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తీర్యాని సర్పంచ్ రాజేష్ నాయకపు గూడా సర్పంచ్ సుమలత, పిఏసిఎస్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీనాయకులు పెరుమండ్ల వెంకటేశంగౌడ్, పంచాయతీ కార్యదర్శి రాజేశ్వరి పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి



- జిల్లా కలెక్టర్ భోర్ఖడే హేమంత్ సహదేవరావు.

**ములుగు జిల్లా, విశాలజ్యోతి:**
ములుగు జిల్లా నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడిఓసి) లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ భోర్ఖడే హేమంత్ సహదేవరావు గారు, జిల్లా అదనపు కలెక్టర్లు సి.హెచ్. మహేందర్ జీ, ఎం. సంపత్ రావులతో కలిసిఅర్జీదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 44 దరఖాస్తులు రాగా, వాటిలో భూమికి సంబంధించినవి 15, ఇందిరమ్మ ఇండ్లకు 4, పెన్షన్లకు 7, ఇతర శాఖలకు సంబంధించినవి 18 దరఖాస్తులు అందాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గారు మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత శాఖల అధికారులకు పంపించినట్లు . వచ్చిన దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించి సమస్యలను పరిష్కరించాలని, ప్రజలకు జవాబుదారీతనంతో వ్యవహరించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమం లో డీఆర్ఓ రవి కుమార్, ఆర్డీఓ కృష్ణవేణి, అన్ని శాఖల జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి వినతులకు సత్వర పరిష్కారం చూపాలి

- అదనపు కలెక్టర్ వేణుగోపాల్

**భద్రాద్రి కొత్తగూడెం(విశాల జ్యోతి):**
ప్రజావాణి వినతులకు సత్వర పరిష్కారం చూపాలని అదనపు కలెక్టర్ వేణుగోపాల్ అన్నారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయం లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, డీఆర్ఓ పద్మావతితో కలిసి ప్రజల నుంచి వినతులు ఫిర్యాదులను స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు భూ సమస్యలు గృహాలు ఉపాధి విద్యుత్ మౌలిక



వసతులు తదితర అంశాలపై తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.
ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ వేణుగోపాల్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రజావాణి కీలక వేదికగా నిలుస్తోందన్నారు. ప్రజల



నుంచి స్వీకరించిన ప్రతి దరఖాస్తును సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. వినతుల పరిష్కారంలో జాప్యం నిర్లక్ష్యానికి తావివ్వకూడదని స్పష్టం చేశారు. తక్షణమే పరిష్కరించగల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఇతర సమస్యలను సంబంధిత శాఖలకు పంపించి వాటి పరిష్కార స్థితిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. శాఖల మధ్య సమన్వయంతో పనిచేసి ప్రజలకు సత్వర సేవలు అందించాలని తెలిపారు.
జిల్లా కేంద్రంతో పాటు మండల స్థాయిలోని ఎంపీడీఓ కార్యాలయాల్లో కూడా ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన ఆధార పత్రాలతో వినతులు సమర్పిస్తే పరిష్కారం మరింత వేగంగా జరిగే అవకాశం ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

# ఉద్యోగం రాలేదని డిప్రెషన్‌లోకి అమెరికాలో హైదరాబాద్ యువకుడి ఆత్మహత్య

అమెరికా లో ఉన్నత విద్య పూర్తిచేసి మంచి భవిష్యత్‌పై ఎన్నో ఆశలు పెట్టుకున్న హైదరాబాదీ యువకుడు సాయిప్రదీప్ జీవితం విషాదాంతమైంది. ఉద్యోగం కోసం చేసిన ప్రయత్నాలు ఫలించక తీవ్ర మనస్తాపానికి గురై అతడు ఆత్మహత్య చేసు కున్నాడు. ఈ ఘటన తీవ్ర కలకలం రేపింది. వివరాల్లోకి వెళ్తే.. హైదరాబాద్‌లోని దమ్మాయిగూడ శ్రీనివాసనగర్ కాలనీకి చెందిన సాయిప్రదీప్ 2024లో ఉన్నత విద్య కోసం అమెరికా వెళ్లాడు. టెక్సాస్ రాష్ట్రం (ూవఇఘుం ౯ఘ్వ) లోని శాన్ ఆంటోనియోలో మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేశాడు. చదువు పూర్తయిన తర్వాత అక్కడే ఉద్యోగం సాధించి స్థిరపడాలని భావించాడు.అయితే గత నాలుగు నెలలుగా ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నా ఆశించిన ఫలితం దక్కలేదు. వరుసగా అవకాశాలు చేజారడంతో తీవ్ర ఒత్తిడికి లోనైన సాయిప్రదీప్ మానసికంగా కుంగిపోయినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఈ క్రమంలో ఆగస్టు 21న శాన్ ఆంటోనియోలోని తన గదిలో సాయిప్రదీప్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనతో.. విదేశాలకు వెళ్లి ఉన్నత చదువులు పూర్తి చేసిన తర్వాత ఉద్యోగ అవకాశాల కోసం ఎదురుచూస్తున్న పలువురు విద్యార్థులు ఎదుర్కొంటున్న ఒత్తిడి మరోసారి చర్చనీయాంశమైంది.

PRGI No: TGBIL/25/A0946
సమగ్ర తెలుగు దినపత్రిక

# సంక్షేమ ఫలాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

- స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీలోఎమ్మెల్యే యశస్విని రెడ్డి



**తొర్రూరు, విశాలజ్యోతి:** తొర్రూరు మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పాలకుర్తి శాసనసభ్యురాలు శ్రీమతి మామిడాల యశస్విని రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని అర్హులైన ప్రతి కుటుంబానికి స్మార్ట్ రేషన్ కార్డులను అందజేస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ సంక్షేమ పాలన అందిస్తోందని పేర్కొన్నారు. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా పారదర్శకంగా ప్రజలకు నిత్యావసర సరుకులు అందడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు మరింత సులభతరం అవుతుందన్నారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి రేషన్ కార్డులు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, ఎలాంటి ఇబ్బందులు ఉన్నా వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం తొర్రూరును అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానన్నారు. ఇచ్చిన మాట ప్రకారం సంవత్సరంలో ఒక ట్యాంక్ బండ్ నిర్మాణాన్ని పూర్తి చేస్తామన్నారు అందుకోసం అదనంగా 5 కోట్ల రూపాయల కేటాయించామన్నారు. వంద పడకల ఆసుపత్రి నిర్మాణం జరుగుతోందన్నారు. త్వరలోనే తొర్రూర్ కు సబ్ ట్రెజరరీ ఆఫీసును తీసుకొచ్చే ప్రయత్నం చేస్తానన్నారు. గత ప్రభుత్వంలో అసంపూర్తిగా ఉన్న డ్రైనేజీ సిసి రోడ్ల నిర్మాణం కూడా త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తూనం శ్రవణ్ కుమార్, వైస్ చైర్మన్ సోమ రజిని రాజశేఖర్, జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యురాలు పంజా కల్పన, తొర్రూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మోత్కూరి రవీం ద్రచారి, కాంగ్రెస్ పట్టణ పార్టీ అధ్య క్షులు, 10వ వార్డు ముద్దసాని సురేష్ ముద్ద్సాని సురేష్, వివిధ గ్రామ సర్పంచులు, మం డల ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయ కులు, మున్సిపల్ మరియు మండల అధికా రులు, ప్రజాప్రతినిధులు మరియు పెద్ద సంఖ్య లో లబ్ధిదారులు పాల్గొన్నారు.

# చిరుతపులి చర్మం గోర్లు స్వాధీనం

- నలుగురు వ్యక్తుల అరెస్ట్
- వివరాలను వెల్లడించిన ఎస్పీ రోహిత్ రాజు



**భద్రాద్రి కొత్తగూడెం(విశాల జ్యోతి):** చిరుతపులి చర్మం గోర్లను అక్రమంగా విక్రయించేందుకు ప్రయత్నించిన నలుగురు వ్యక్తులను అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపహాడ్ పోలీస్ స్టేషన్ పరిధిలో చిరుతపులి చర్మం గోర్లను అక్రమంగా విక్రయించేందుకు ప్రయత్నిస్తున్న నలుగురు వ్యక్తులు చల్లా అనిల్ కుమార్, కుంజ భద్రయ్య, కుంజా గంగరాజు, మడవి కన్నయ్యలను బూర్గంపహాడ్ పోలీసులు టాస్క్ ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లుగా చెప్పారు. విశ్వసనీయ సమాచారం మేరకు, బూర్గంపహాడ్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ నాగ బిక్షం, టాస్క్ ఫోర్స్ పోలీసుల ఆధ్వర్యంలో తాళ్లగొమ్మూరు గ్రామం అనిల్ అనే వ్యక్తీ ఇంటి వద్ద ఒక చిన్న బ్యాగ్‌తో అనుమానాస్పదంగా ఉన్న నలుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించినట్లుగా తెలిపారు. నిందితులు గత సంవత్సరం వేసవి కాలంలో చింతూరు మండలం గమ్మలకోట గ్రామానికి సమీపంలోని అటవీ ప్రాంతంలో గుంతలో పడిపోయి బయటకు రాలేని పరిస్థితిలో ఉన్న చిరుతపులిని రాళ్లు కర్రలతో కొట్టి భాణాలు విసిరి చంపినట్లు తెలిపారు. అనంతరం దాని చర్మం గోర్లను తొలగించి చర్మాన్ని ఎండబెట్టి గోర్లను భద్రపరిచి ఉంచినట్లు వెల్లడించారు. తరువాత చిరుతపులి చర్మం గోర్లను విక్రయించి డబ్బు సంపాదించాలని ప్రయత్నిస్తుండగా సారపాకకు చెందిన చల్లా అనిల్ కుమార్ అనే వ్యక్తీ భూమిని కౌలుకు తీసుకునే వ్యవసాయం చేయుట కొరకు గమ్మలకోట గ్రామం చింతూరు మండలంకు చెందిన కుంజా భద్రయ్య వద్దకు రాగా అతనిని సంప్రదించినట్లు తెలిపారు. అనిల్ కుమార్ కొనుగోలుదారులను సం ప్రదించి విక్రయానికి సహకరిస్తానని చెప్ప డంతో కుంజ భద్రయ్య, కుంజా గంగరాజు, మడవి కన్నయ్య ముగ్గురు కలిసి చిరుతపులి చర్మం గోర్లను ఒక చిన్న బ్యాగ్‌లో పెట్టుకుని తాళ్లగొమ్మూరులోని అనిల్ కుమార్ ఇంటికి తీసుకువచ్చారు. ఈ క్రమంలో చిరుతపులి చర్మాన్ని విక్రయి ంచేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుల వద్ద నుంచి చిరుతపులి చర్మం, 17 గోర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ డిఎస్పి ఆర్ సతీష్ కుమార్, ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, పాల్వ ంచ సీఐ సతీష్, టాస్క్ ఫోర్స్ సీఐ రమాకాంత్, ఎస్సైలు నాగ బిక్షం, ప్రవీణ్, సుమన్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# మార్కెట్‌లో రెండు రకాల పనీర్‌లు ఉంటాయని తెలుసా

## అసలైన పనీర్‌ను ఎలా గుర్తించాలంటే



భారతీయ వంటకాల్లో పనీర్‌కు ప్రత్యేక స్థానం ఉంది. ప్రోటీన్‌తోపాటు కాల్షియం వంటి పోషకాలను అందించే పనీర్‌ను చాలామంది క్రమం తప్పకుండా తీసుకుంటారు. అయితే మార్కెట్‌లో ఫ్రెష్ పనీర్‌కు ప్రత్యామ్నాయంగా అనలాగ్ పనీర్ కూడా లభిస్తోంది. రెండూ చూడడానికి, రుచి, ఆకృతిలో దాదాపు ఒకేలా కనిపించినప్పటికీ, వాటి తయారీ విధానం, పోషక విలువలు, ఆరోగ్యంపై ప్రభావంలో గణనీయమైన తేడాలు ఉంటాయి. అందువల్ల పనీర్ కొనుగోలు చేసేటప్పుడు అది నిజమైన పాలతో తయారైనదా లేదా అనలాగ్ పనీరా అనే విషయాన్ని తెలుసుకోవడం ముఖ్యం. సాధారణంగా ఫ్రెష్ పనీర్‌ను ఆవు పాలతో తయారు చేస్తారు. దీనికి విరుద్ధంగా అనలాగ్ పనీర్‌లో కూరగాయల కొవ్వులు, వెజిటబుల్ ఆయిల్స్, పాలు లేదా పాల పదార్థాలు, స్టార్చ్‌లు, ఎమల్సిఫైయర్లు, స్టెబిలైజర్లు, ఇతర యాడిటివ్స్ వంటి పదార్థాలను ఉపయోగించి పనీర్‌లా కనిపించేలా తయారు చేస్తారు. తయారీదారుని బట్టి ఉపయోగించే పదార్థాల పరిమాణం మారుతుంది. అందువల్ల అనలాగ్ పనీర్‌కు ఒకే విధమైన స్థిరమైన పోషక విలువ ఉండదు.

**పోషక విలువలు ఎలా ఉంటాయి..**

భారతీయ వైద్య పరిశోధనా మండలి (ఐసీఎంఆర్), నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ (ఎన్ఐఎన్) ప్రకారం 100 గ్రాముల ఫ్రెష్ పనీర్‌లో సుమారు 265 కేలరీలు, 18.3 గ్రాముల ప్రోటీన్, 20.8 గ్రాముల కొవ్వు, 1.2 గ్రాముల కార్బోహైడ్రేట్లు ఉంటాయి. అలాగే సుమారు 480 మిల్లీగ్రాముల కాల్షియం, 290 మిల్లీగ్రాముల ఫాస్ఫరస్, 0.2 మిల్లీగ్రాముల ఐరన్, 22 మిల్లీగ్రాముల సోడియం, 0.8 మిల్లీగ్రాముల జింక్ లభిస్తాయి. అనలాగ్ పనీర్‌లో మాత్రం తయారీ విధానాన్ని బట్టి పోషక విలువలు మారుతాయి. అందుబాటులో ఉన్న అంచనాల ప్రకారం 100 గ్రాముల అనలాగ్ పనీర్‌లో సుమారు 250 నుంచి 320 కేలరీలు, 6 నుంచి 15 గ్రాముల ప్రోటీన్, 18 నుంచి 25 గ్రాముల కొవ్వు, 5 నుంచి 15 గ్రాముల కార్బోహైడ్రేట్లు, 100 నుంచి 400 మిల్లీగ్రాముల కాల్షియం ఉంటాయి. అంటే ఫ్రెష్ పనీర్‌తో పోలిస్తే అనలాగ్ పనీర్‌లో ప్రోటీన్ పరిమాణం తక్కువగా ఉండే అవకాశం ఉంటుంది. ఫ్రెష్ పనీర్ తయారీ ప్రక్రియ తక్కువగా ప్రాసెస్ చేసిందిగా ఉండటంతో కేసిన్, వెయ్ వంటి పాల ప్రోటీన్లు అందుతాయి. అందువల్ల ప్రోటీన్ అవసరం ఉన్నవారికి ఫ్రెష్ పనీర్ మెరుగైన ఎంపికగా ఉంటుంది. తక్కువ పరిమాణంలో తీసుకున్నా ప్రోటీన్ కారణంగా ఎక్కువసేపు కడుపు నిండిన భావన కలిగించడంలో కూడా ఇది సహాయపడుతుంది.

**అనలాగ్ పనీర్‌తో ప్రతికూల ప్రభావాలు..**

అనలాగ్ పనీర్ తక్కువ ధర, ఒకే విధమైన ఆకృతి, ఎక్కువకాలం నిల్వ ఉండే లక్షణాల కారణంగా మార్కెట్‌లో ఉపయోగంలో ఉంది. అయితే ఇందులో ఎక్కువగా ప్రాసెస్ చేసిన పదార్థాలు ఉండే అవకాశం ఉండటంతో ఫ్రెష్ పనీర్‌తో పోలిస్తే పోషక విలువ తక్కువగా ఉంటాయి. ముఖ్యంగా ప్రోటీన్ సాంద్రత తక్కువగా ఉండే అవకాశం ఉంటుంది. అనలాగ్ పనీర్‌ను తరచూ తీసుకోవడం వల్ల కొన్ని ప్రతికూల ప్రభావాలు ఉంటాయి. తయారీ విధానాన్ని బట్టి ఇందులో సోడియం ఎక్కువగా ఉండే అవకాశం ఉంటుంది. అధికంగా ప్రాసెస్ చేసిన పదార్థాలు జీర్ణవ్యవస్థపై ప్రభావం చూపిస్తాయి. అలాగే సూక్ష్మపోషకాల సాంద్రత తక్కువగా ఉండటం వల్ల ఇది పోషకపరంగా ఫ్రెష్ పనీర్ కంటే తక్కువ స్థాయిలో ఉంటుంది. ప్రోటీన్ తక్కువగా ఉంటే కడుపు నిండిన భావన కూడా తగ్గి, ఎక్కువ ఆహారం తీసుకునే అవకాశం ఉంటుంది. అనలాగ్ పనీర్‌ను గుర్తించడానికి ముందుగా ప్యాకెట్‌పై ఉన్న పదార్థాల జాబితాను పరిశీలించాలి. వెజిటబుల్ ఫ్యాట్స్, ఆయిల్స్, స్టార్చ్‌లు, ఎమల్సిఫైయర్లు, స్టెబిలైజర్లు వంటి పదార్థాలు ఉన్నాయా అనేది చూడాలి. కేవలం పనీర్ రంగు లేదా ఆకృతిని చూసి అది ఫ్రెష్ పనీర్ అని నిర్ణయించకూడదు.

**ఆకృతిలో తేడాలు..**


ఆకృతిలో కూడా కొంత తేడా కనిపిస్తుంది. అనలాగ్ పనీర్ సాధారణంగా కొంత గట్టిగా, ఎక్కువ ఎలాస్టిక్‌గా ఉంటుంది. వండినప్పుడు కూడా సులభంగా తన ఆకృతిని కోల్పోకుండా ఉండే అవకాశం ఉంటుంది. ఫ్రెష్ పనీర్ మాత్రం మరింత సహజమైన, తాజా రుచిని కలిగి ఉంటుంది. వీలైనంత వరకు రోజూ పాల ఉత్పత్తులు తయారు చేసే నమ్మకమైన డెయిరీలు లేదా విశ్వసనీయ వనరుల నుంచి పనీర్‌ను కొనుగోలు చేయాలి. బరువు తగ్గడం లేదా ఫిట్‌నెస్‌పై దృష్టి పెట్టేవారికి కూడా ఫ్రెష్ పనీర్ ఉపయోగకరమైన ఎంపికగా ఉంటుంది. ఇందులో ఉండే అధిక-నాణ్యత ప్రోటీన్ కండరాల పునరుద్ధరణకు తోడ్పడుతుంది. తక్కువ పరిమాణంలో తీసుకున్నా ప్రోటీన్ కారణంగా కడుపు నిండిన భావన కలిగిస్తుంది. అయితే మొత్తం కేలరీలు, కొవ్వు పరిమాణం, తీసుకునే పరిమాణం వంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి. అనలాగ్ పనీర్ విషయంలో మాత్రం దాని కచ్చితమైన పోషక విలువ తయారీదారు ఉపయోగించిన పదార్థాలపై ఆధారపడి ఉంటుంది. అందువల్ల ప్యాకెట్‌పై ఉన్న ఫుడ్ లేబుల్‌ను పూర్తిగా చదివిన తర్వాతే కొనుగోలు చేయడం మంచిది. కేవలం తక్కువ ధర లేదా ఎక్కువకాలం నిల్వ ఉండటం వంటి కారణాలతో దానిని తరచూ తీసుకోవడం కంటే, అందులో ఉపయోగించిన పదార్థాలను పరిశీలించడం ముఖ్యం.

**వివరాలను పరిశీలించాలి..**

పిల్లలు, క్రీడాకారులు, వృద్ధులు, ఎక్కువ ప్రోటీన్ అవసరమయ్యే వారు, అనారోగ్యం నుంచి కోలుకుంటున్న వారు తదితర వర్గాలకు ఫ్రెష్ పనీర్ మెరుగైన ఎంపికగా నిలుస్తుంది. ముఖ్యంగా పెరుగుతున్న వయసులో ఉన్నవారు లేదా ఎక్కువగా ప్రాసెస్ చేసిన ఆహారాన్ని జీర్ణించుకోవడంలో ఇబ్బంది ఉండేవారు ఫ్రెష్ పనీర్‌ను ఎంచుకోవడం మంచిది. ఫ్రెష్ పనీర్, అనలాగ్ పనీర్ రెండూ ఒకేలా కనిపించినప్పటికీ వాటి తయారీ విధానం, ప్రోటీన్, కొవ్వు, కాల్షియం వంటి పోషకాల పరిమాణం భిన్నంగా ఉంటుంది. అందువల్ల పనీర్ కొనుగోలు చేసే ముందు లేబుల్‌ను చదవడం, పదార్థాలను పరిశీలించడం, విశ్వసనీయ వనరుల నుంచి కొనుగోలు చేయడం చాలా ముఖ్యం. రోజువారీ ఆహారంలో పనీర్‌ను చేర్చుకునే వారు సాధ్యమైనంత వరకు ఫ్రెష్ పనీర్‌కు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా అధిక ప్రాసెసింగ్‌కు గురైన ప్రత్యామ్నాయాలను తగ్గించవచ్చు.

### డయాబెటిస్ లేకపోయినా షుగర్ లెవల్స్ పెరుగుతాయా

# నిపుణులు ఏం చెబుతున్నారు



భోజనం చేసిన తర్వాత రక్తంలో చక్కెర స్థాయిలు కొంత పెరగడం సహజమే. అయితే అది ఎంత మేర పెరిగింది, ఎంతసేపు ఎక్కువగా ఉంది, ఎంత తరచూ జరుగుతోంది, ఆ తర్వాత మళ్లీ సాధారణ స్థాయికి వస్తుందా అనే విషయాలను పరిశీలించడం ముఖ్యం. ఒక్కసారి బ్లడ్ షుగర్ పెరిగినంత మాత్రాన డయాబెటిస్ ఉందని నిర్ధారించలేం. ఆహారం, శారీరక శ్రమ, నిద్ర, ఒత్తిడి వంటి అనేక అంశాలు రక్తంలో గ్లూకోజ్ స్థాయిలని తాత్కాలికంగా ప్రభావితం చేస్తాయి. మనం కార్బోహైడ్రేట్లు ఉన్న ఆహారం తీసుకున్నప్పుడు జీర్ణవ్యవస్థ వాటిని గ్లూకోజ్‌గా విడగొడుతుంది. ఈ గ్లూకోజ్ రక్తంలోకి చేరడంతో బ్లడ్ షుగర్ పెరుగుతుంది. దీనికి ప్రతిస్పందనగా క్లోమం ఇన్సులిన్‌ను విడుదల చేస్తుంది. ఇన్సులిన్ రక్తంలోని గ్లూకోజ్‌ను కండరాలు, ఇతర కణజాలాల్లోకి చేరేలా చేస్తుంది. సాధారణంగా డయాబెటిస్ లేని వారిలో ఈ ప్రక్రియ కొంత సమయం తర్వాత రక్తంలో చక్కెరను సాధారణ స్థాయికి తీసుకువస్తుంది.

**ఆహారాలను బట్టి మార్పులు..**

అయితే ప్రతి ఆహారం రక్తంలో చక్కెరను ఒకే విధంగా పెంచదు. తెల్ల బియ్యం, ఆలుగడ్డలు, చక్కెర కలిగిన పానీయాలు, స్వీట్లు వంటి ఆహారాలు గ్లూకోజ్‌ను వేగంగా పెంచుతాయి. మరోవైపు కూరగాయలు, ప్రోటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులు, అధిక ఫైబర్ ఉన్న కార్బోహైడ్రేట్లతో కూడిన ఆహారం రక్తంలో గ్లూకోజ్ పెరుగుదల వేగాన్ని తగ్గిస్తుంది. తీసుకునే ఆహారం పరిమాణం కూడా ఇందులో కీలక పాత్ర పోషిస్తుంది. తీవ్రమైన ఒత్తిడి ఉన్న సమయంలో కూడా బ్లడ్ షుగర్ తాత్కాలికంగా పెరుగుతుంది. ఒత్తిడికి ప్రతిస్పందనగా శరీరంలో కార్టిసాల్, అడ్రినలిన్ వంటి హార్మోన్లు విడుదలవుతాయి. ఇవి కాలేయంలో నిల్వ ఉన్న గ్లూకోజ్‌ను రక్తంలోకి విడుదల చేయమని సంకేతాలు ఇస్తాయి. ఫలితంగా గతంలో బ్లడ్ షుగర్ సమస్యలు లేని వ్యక్తుల్లో కూడా కొంతకాలం గ్లూకోజ్ స్థాయిలు పెరిగే అవకాశం ఉంటుంది. అనారోగ్యం, జ్వరం లేదా శారీరక గాయం సమయంలో కూడా ఇలాంటి పరిస్థితి కనిపిస్తుంది. ఈ సమయ ంలో ఒత్తిడి హార్మోన్లు పెరగడంతోపాటు కొంత కాలం ఇన్సులిన్ ప్రభావం తగ్గుతుంది. అలాగే నిద్ర సరిగా లేకపోవడం కూడా ఇన్సులిన్ సెన్సిటివిటీ, ఆకలి నియంత్రణపై ప్రభావం చూపుతుంది. కాబట్టి తక్కువ గంటలు నిద్రపోయే రోజుల్లో బ్లడ్ షుగర్ ఎక్కువగా కనిపిస్తే, ఈ రెండింటి మధ్య సంబంధం ఉంటుంది.

**వ్యాయామం అవసరం..**

వ్యాయామం కూడా బ్లడ్ షుగర్‌పై వివిధ రకాల ప్రభావాలు చూపుతుంది. సాధారణంగా ఏరోబిక్ వ్యాయామం కండరాలు గ్లూకోజ్‌ను ఉపయోగించుకునేలా చేసి బ్లడ్ షుగర్‌ను తగ్గించడంలో సహాయపడుతుంది. అయితే తీవ్రమైన వ్యాయామం, ముఖ్యంగా అధిక శ్రమతో కూడిన అనెరోబిక్ వ్యాయామం సమయంలో అడ్రినలిన్ వంటి హార్మోన్ల ప్రభావంతో కాలేయం ఎక్కువ గ్లూకోజ్‌ను రక్తంలోకి విడుదల చేస్తుంది. దీంతో కొద్దిసేపు బ్లడ్ షుగర్ పెరిగినట్లు కనిపిస్తుంది. దీనర్థం వ్యాయామం మానేయాలని కాదు. క్రమం తప్పకుండా శారీరక శ్రమ చేయడం దీర్ఘకాలంలో ఇన్సులిన్ సెన్సిటివిటీని మెరుగుపరచి శరీరం గ్లూకోజ్‌ను సమర్థంగా వినియోగించుకునేలా చేస్తుంది. కొన్ని మందులు కూడా రక్తంలో చక్కెర స్థాయిలను ప్రభావితం చేస్తాయి. ముఖ్యంగా ప్రెడ్నిసోలోన్ వంటి కార్టికోస్టెరాయిడ్లు బ్లడ్ షుగర్‌ను పెంచే అవకాశం ఉంది. కొన్ని హార్మోనల్ మందులు, ఇతర ఔషధాలు కూడా గ్లూకోజ్ నియంత్రణపై ప్రభావం చూపిస్తాయి. కొత్త మందు ప్రారంభించిన తర్వాత బ్లడ్ షుగర్ పదేపదే పెరుగుతున్నట్లు గమనిస్తే, వైద్యుడిని సంప్రదించాలి. వైద్యుడి సలహా లేకుండా మందులను స్వయంగా ఆపకూడదు. మనం ఏం తింటున్నామన్నదే కాకుండా ఎలా తింటున్నామన్నది కూడా ముఖ్యం. ఉదాహరణకు చక్కెర కలిపిన టీ, తెల్ల బ్రెడ్, జామ్‌తో కూడిన అల్పాహారంలో వేగంగా శోషణకు గురయ్యే కార్బోహైడ్రేట్లు ఎక్కువగా ఉండి ఫైబర్, ప్రోటీన్ తక్కువగా ఉంటాయి. దీనివల్ల గ్లూకోజ్ వేగంగా పెరుగుతుంది. దీనికి బదులుగా గుడ్లు, కూరగాయలు, సంపూర్ణ ధాన్యాలతో కూడిన అల్పాహారం తీసుకోవడం వల్ల గ్లూకోజ్ రక్తంలోకి చేరే వేగాన్ని తగ్గించవచ్చు.

**పిండిపదార్థాలను పూర్తిగా పక్కన పెట్టొద్దు..**

కార్బోహైడ్రేట్లను పూర్తిగా మానేయాల్సిన అవసరం లేదు. వాటి పరిమాణంపై శ్రద్ధ పెట్టడం, ఎక్కువ ఫైబర్ ఉన్న ఆహారాన్ని ఎంచుకోవడం, కార్బోహైడ్రేట్లను ప్రోటీన్‌తో కలిపి తీసుకోవడం ద్వారా బ్లడ్ షుగర్ వేగంగా పెరగడాన్ని నియంత్రించడంలో సహా యపడతాయి. ఒక్కసారి వచ్చిన అధిక బ్లడ్ షుగర్ రీడింగ్‌ను చూసి ఆందోళన చెందా ల్సిన అవసరం లేదు. ఇంట్లో ఉపయోగించే గ్లూకోజ్ మీటర్లకు కూడా కొన్ని పరిమితులు ఉంటాయి. పరీక్షను ఎప్పుడు చేశారన్నది కూడా ఫలితాన్ని అర్థం చేసుకోవడంలో కీలకం. అయితే బ్లడ్ షుగర్ పదేపదే ఎక్కు వగా వస్తుంటే మాత్రం దానిని నిర్లక్ష్యం చేయ కూడదు. ముఖ్యంగా అధిక దాహం, తరచూ మూత్ర విసర్జన, కారణం లేకుండా బరువు తగ్గడం, అసాధారణమైన అలసట లేదా చూపు మసకబారడం వంటి లక్షణాలు కూడా ఉంటే వైద్యుడిని సంప్రదించాలి. అవసరాన్ని బట్టి వైద్యులు ఓరల్ గ్లూకోజ్ టాలరెన్స్ టెస్ట్, ఫాస్టింగ్ బ్లడ్ గ్లూకోజ్, హెచ్‌బీఏ1సీ వంటి పరీక్షలను సూచిస్తారు. ముఖ్యంగా హెచ్‌బీఏ1సీ పరీక్ష గత రెండు నుంచి మూడు నెలల కాలంలో సగటు రక్తంలో చక్కెర స్థాయిపై అంచనాను ఇస్తుంది. అందువల్ల భోజనం తర్వాత ఒక్కసారి వచ్చిన రీడింగ్‌పై ఆధారపడటం కంటే ఈ పరీక్షలు శరీరంలోని గ్లూకోజ్ నియంత్రణపై మెరుగైన సమాచారాన్ని అందిస్తాయి.

**ప్రీ డయాబెటిస్ దశలోనూ..**

డయాబెటిస్‌కు ముందు దశగా పరిగణించే ప్రీడయాబెటిస్‌లో కూడా రక్తంలో గ్లూకోజ్ స్థాయిలు పదేపదే పెరుగుతాయి. ఈ దశలో స్పష్టమైన లక్షణాలు ఉండవు. పొట్ట చుట్టూ అధిక కొవ్వు, కుటుంబంలో డయాబెటిస్ చరిత్ర, అధిక రక్తపోటు, కొలెస్ట్రాల్ స్థాయిల్లో మార్పులు లేదా గర్భధారణ సమయంలో డయాబెటిస్ వచ్చిన చరిత్ర వంటి ప్రమాద కారకాలు ఉన్నవారు పరీక్షలపై మరింత శ్రద్ధ పెట్టడం అవసరం. అందువల్ల బ్లడ్ షుగర్ ఒక్కసారిగా పెరగడం అంటే ఒక కొలత మాత్రమే, డయాబెటిస్ నిర్ధారణ కాదు. అధిక కార్బోహైడ్రేట్లతో కూడిన భోజనం, తీవ్రమైన వ్యాయామం లేదా ఒత్తిడితో కూడిన రోజులో తాత్కాలికంగా బ్లడ్ షుగర్ పెరుగుతుంది. అయితే ఎలాంటి స్పష్టమైన కారణం లేకుండానే రీడింగ్స్ పదేపదే ఎక్కువగా వస్తుంటే లేదా ఇతర లక్షణాలు కనిపిస్తే వైద్య పరీక్షలు చేయించుకోవడం మంచిది. బ్లడ్ షుగర్‌ను మరింత సమర్థవంతంగా అర్థం చేసుకోవడానికి పరీక్ష చేసిన సమయం, ఆ సమయంలో తీసుకున్న ఆహారం, చేసిన శారీరక శ్రమ, అనారోగ్యం లేదా ఒత్తిడి వంటి వివరాలను నమోదు చేసుకోవాలి. ఒక్క సంఖ్య కంటే కొన్ని రోజుల నుంచి వారాల వరకు కనిపించే విధానం, అంటే బ్లడ్ షుగర్‌లోని మార్పుల నమూనా, ఆరోగ్య పరి స్థితిని అర్థం చేసుకోవడంలో మరింత ఉప యోగకరంగా ఉంటుందని నిపుణులు చెబు తున్నారు.

PRGI No: TGBIL/25/A0946
సమగ్ర తెలుగు దినపత్రిక

# నకిలీ డీఎస్పీగా అవతారం రూ 1 20 కోట్ల మోసం




**హైదరాబాద్ :** నగరంలో నకిలీ డీఎస్పీగా అవతారమెత్తి అమాయకులను మోసం చేస్తున్న కేవీపీ రాజు అలియాస్ డీఎస్పీ రాజును హైదరాబాద్ సీసీఎస్ ఈఓడబ్ల్యూ బృందం అరెస్ట్ చేసింది. తిరుపతి డీఎస్పీ పేరును ఉపయోగించుకుంటూ తనకు ఉన్నతస్థాయి పరిచయాలు ఉన్నాయని నమ్మిస్తూ పలువురి నుంచి భారీగా డబ్బులు వసూలు చేసినట్లు పోలీసులు గుర్తించారు. బోగస్ కంపెనీల్లో పెట్టుబడులు పెడితే భారీ లాభాలు వస్తాయని ఆశ చూపించి బాధితులను తన వలలోకి లాగినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఈ క్రమంలో ఓ బాధితుడి నుంచి ఏకంగా రూ.1.20 కోట్లు వసూలు చేసినట్లు పోలీసులు తెలిపారు. తెలంగాణతో పాటు ఏపీలోనూ పలువురిని ఇదే తరహాలో మోసం చేసినట్లు నిందితుడిపై ఆరోపణలు ఉన్నాయి. నకిలీ హోదాలు, అధికారుల పేర్లు ఉపయోగించుకుని బాధితుల్లో నమ్మకం కలిగించి డబ్బులు దండుకున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. 2021 నుంచి పోలీసులకు చిక్కకుండా పరారీలో ఉన్న కేవీపీ రాజును ఎట్టకేలకు సీసీఎస్ ఈఓడబ్ల్యూ అధికారులు అరెస్ట్ చేశారు.కేవీపీ రాజు అలియాస్ డీఎస్పీ రాజుపై ఇప్పటికే మూడు క్రిమినల్ కేసులు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. నకిలీ డీఎస్పీగా తనను తాను పరిచయం చేసుకుంటూ భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేసిన వ్యవ హారంపై మరింత లోతుగా దర్యాప్తు చేస్తు న్నారు. నిందితుడి ద్వారా మోసపోయిన బాధి తులు ఇంకా ఎవరైనా ఉన్నారా, అతడి మోసా ల వెనుక మరికొందరి ప్రమేయం ఉందా అనే కోణంలోనూ అధికారులు వివరాలు . అరెస్ట్ అనంతరం నిందితుడిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

# జాబ్ నోటిఫికేషన్లు నిల్ లిక్కర్ నోటిఫికేషన్లు మాత్రం ఫుల్ హరీశ్ రావు




**హైదరాబాద్:** తెలంగాణ ప్రభుత్వం కొత్తగా 121 రకాల మద్యం బ్రాండ్లకు నోటిఫికేషన్ ఇవ్వడంపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రంగా స్పందించారు. రాష్ట్రంలో ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు ఇవ్వకుండా.. మద్యం బ్రాండ్లకు మాత్రం నోటిఫికేషన్లు జారీ చేస్తున్నారంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు.'జాబ్ నోటిఫికేషన్లు నిల్.. లిక్కర్ నోటిఫికేషన్లు మాత్రం ఫుల్' అంటూ హరీశ్ రావు ఎద్దేవా చేశారు. యువత భవిష్యత్తుకు భరోసా కల్పించాల్సిన ప్రభుత్వం ఉద్యోగాల భర్తీపై దృష్టి పెట్టకుండా మద్యం వ్యాపారంపై ఎందుకు అంత ఆసక్తి చూపుతోందని ప్రశ్నించారు.రాష్ట్రంలో నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్నారని, వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని హరీశ్ రావు పేర్కొన్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం లిక్కర్ అమ్మకాలపైనే ఎక్కువ శ్రద్ధ చూపుతోందని ఆయన ఆరోపించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ప్రభుత్వ తీరుపై విమర్శలు చేశారు.

# పెద్దపల్లిలో ఉగ్ర లింకుల కలకలం

## ఎన్ఐఏ అదుపులో ఇంజినీరింగ్ విద్యార్థి

**పెద్దపల్లి:** పెద్దపల్లి జిల్లాలోని రామగుండంలో ఉగ్ర లింకులు కలకలం రేపాయి. అయోధ్య నగర్‌లో నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ(ఎన్ఐఏ) తనిఖీల్లో ఈ విషయాలు బయటపడ్డాయి. ఈ క్రమంలో రామగుండానికి చెందిన ఇంజినీరింగ్ విద్యార్థి ముజామిల్ ఖాన్‌ను అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ముజామిల్ ఖాన్‌కు ఉగ్రవాద సంస్థలతో సంబంధాలు ఉన్నాయన్న అనుమానంతో అధికారులు విచారణ చేపట్టినట్లు సమాచారం. ప్రస్తుతం ముజామిల్‌ను ఎన్ఐఏ అధికారులు.. ఎన్‌టీపీసీ పోలీస్‌స్టేషన్‌కు తరలించి ప్రశ్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఉగ్రవాదులతో విద్యార్థికి ఎలాంటి లింకులు ఉన్నాయి, పరిచయాలు, ఉగ్రవాద సంస్థలతో సంబంధాలు తదితర అంశాలపై దర్యాప్తు కొనసాగుతున్నట్లు సమాచారం.మూడేళ్ల క్రితం కూడా కరీంనగర్‌లో ఉగ్రలింక్‌లు బయటపడిన



విషయం తెలిసిందే. ఉగ్రవాదులతో సంబంధాలు ఉన్నాయంటూ జగిత్యాలకు చెందిన వ్యక్తిని ఎన్ఐఏ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఇప్పుడు తాజాగా మరోసారి రామగుండంలో ఇంజినీరింగ్ విద్యార్థిని ఎన్ఐఏ అధికారులు అదుపులోకి తీసుకుని విచారించడం, సోదాలు నిర్వహించడం సంచలనం రేపుతోంది.

## ఈగల్ శాఖలో ఇంటి దొంగల బాగోతం డ్రగ్స్ పెడ్లర్లతో కలిసి




**హైదరాబాద్:** డ్రగ్స్ నిర్మూలన కోసం పనిచేసే ఈగల్ శాఖలోనే ఇద్దరు కానిస్టేబుల్స్ డ్రగ్స్ దందాకు పాల్పడటం తీవ్ర కలకలం రేపుతోంది. ఈగల్ ఇంటి దొంగలైన కానిస్టేబుల్ నరహరి, స్వామిలపై అధికారులు చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది. దాదాపు రూ.50 లక్షలు విలువైన ఎక్టసీ పిల్స్‌ను స్వాధీనం చేసుకున్న కానిస్టేబుల్స్.. దీనికి సంబంధించిన సమాచారాన్ని అధికారులకు ఇవ్వనట్లు తెలుస్తోంది. 50 లక్షల విలువైన ఒక కిలో ఎక్టసీ మాత్రలను అక్రమంగా విక్రయించేందుకు వీరిద్దరూ ప్రయత్నించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇందుకోసం ఏకంగా డ్రగ్ పెడ్లర్లను సంప్రదించినట్లు సమాచారంఒక డ్రగ్ పెడ్లర్‌ను పట్టుకునేందుకు హెచ్‌న్యూ అధికారులు చేపట్టిన ఆపరేషన్‌లో.. కానిస్టేబుళ్ల నరహరి, స్వామిల బాగోతం బట్టబయలైంది. గతంలో వీరిద్దరూ పలు విజయవంతమైన యాంటీ డ్రగ్స్ ఆపరేషన్స్ చేసి అవార్డులు కూడా అందుకున్నారు. ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకున్న ఈగల్ టీం.. ఇద్దరు కానిస్టేబుళ్లను విధుల నుంచి దూరం పెట్టినట్లు తెలుస్తోంది. నరహరి, స్వామిలపై అంతర్గతంగా విచారణ చేపట్టినట్లు సమాచారం. డ్రగ్స్ పెడ్లర్లతో వీరికి ఉన్న సంబంధాలు, ఎక్టసీ మాత్రలు ఎక్కడి నుంచి వచ్చాయి, ఈగల్ శాఖలో మరెవరైనా ఇందులో భాగస్వాములై ఉన్నారా అనే కోణంలో ఈగల్ అధికారులు విచారణ చేస్తున్నట్లు తెలుస్తోంది.

**వరంగల్‌లో 120 కిలోల గంజాయి పట్టివేత**

వరంగల్ జిల్లాలో భారీగా గంజాయి పట్టుబడింది. దాదాపు 120 కిలోల గంజాయిని కారులో రవాణా చేస్తున్న ఇద్దరిని వర్ధన్నపేటలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితులు గంజాయిని ఒడిశా నుంచి కేరళంకు తరలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.60 లక్షలు ఉంటుందని అంచనా. నిందితులు రవాణాకు ఉపయోగించిన కారు త్రిపుర రాష్ట్రానికి చెందినదిగా గుర్తించారు. 120 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్న పోలీసులు.. గంజాయి రవాణాకు ఇంకెవరైనా సహకరించారా అన్న కోణంలో దర్యాప్తు చేపట్టారు.

## చికెన్ వ్యర్థాలపై అధికారుల చర్యలు

# 100 టన్నుల స్వాధీనం



**హైదరాబాద్ :** చికెన్ వ్యర్థాల మాఫియాపై సైబరాబాద్ పోలీసులు, వెటర్నరీ అధికారులు సోదాలు చేశారు. వంద టన్నుల వ్యర్థాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. చేపల చెరువు యజమానులకు చికెన్ వ్యర్థాలను విక్రయించి ఈ మాఫియా సొమ్ము చేసుకుంటున్నట్లు పోలీసులు గుర్తించారు. చికెన్ వ్యర్థాలతో పెరిగే చేపలు తింటే క్యాన్సర్ బారిన పడే అవకాశం ఉందంటూ అధికారులు హెచ్చరించారు.అత్తాపూర్, మియాపూర్, అమీన్‌పూర్, కూకట్‌పల్లి, జీడిమెట్ల, చింతల్‌లో లారీల్లో డంప్ చేస్తోండగా అధికారులు తనిఖీలు చేపట్టారు. గతంలో కేసులు నమోదైన కూడా ఈ చికెన్ మాఫియా పట్టించుకోలేదని అధికారులు చెబుతున్నారు. రాత్రి సమయంలో ఏపీలోని చేపల చెరువు యజమానులకు ఈ వ్యర్థాలను విక్రయించి మాఫియా సొమ్ము చేసుకుంటున్నట్లు అధికారులు నిర్ధారించారు. గత నెలలోనే వందటన్నుల చికెన్ వ్యర్థాలను హెచ్ ఫాస్ట్ అధికారులు స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. తాజాగా మళ్లీ అదే రీతిలో చికెన్ వ్యర్థాలను తరలిస్తోండటంతో అధికారులు సోదాలు చేసి చర్యలు చేపట్టారు

# కొండా సురేఖ అంశం ఆ రిపోర్టు వచ్చాకే నిర్ణయం మహేశ్ గౌడ్



**మెదక్ జిల్లా** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కొండా సుస్మిత వ్యాఖ్యలపై మంత్రి కొండా సురేఖ స్పందించిన తీరు ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో చర్చ నీయాంశంగా మారింది. కొండా సురేఖపై చర్యలు తీసుకోవాలని పార్టీ నేతలు పట్టుబ డుతున్న పరిస్థితి. ఈ నేపథ్యంలో సురేఖ అంశంపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. మెదక్ హౌసింగ్ బోర్డులోని వినాయక ఫంక్షన్ హాల్లో నిర్వహించిన ఉమ్మ డి మెదక్ జిల్లా సమావేశంలో టీపీసీసీ చీఫ్ మాట్లాడుతూ.. కొండా సురేఖ అంశాన్ని క్రమశిక్షణ కమిటీ పరిశీలిస్తోందని చెప్పారు. ఇప్పటికే ప్రిలిమినరీ రిపోర్ట్‌ను అందజేశామని.. డిటైల్డ్ రిపోర్ట్ వచ్చాక పెద్దలు ఈ అంశంపై నిర్ణయం తీసుకుంటారని వెల్లడించారు.కాంగ్రెస్ పెద్ద పార్టీ కాబట్టి చెప్పుకునే స్వేచ్ఛ ఎక్కువ ఉంటుందని మహేశ్ తెలిపారు. స్వేచ్ఛ హద్దులు దాటితే క్రమశిక్షణ చర్యలు తప్పవని.. తనతో సహా అందరూ హద్దుల్లో ఉంటే మంచిదన్నారు. ప్రతి కుటుంబంలో సమస్యలు ఉన్నట్టుగానే కాంగ్రెస్ కుటుంబంలో కూడా ఉంటా యన్నారు. 'కష్టపడ్డ కాంగ్రెస్ కార్యకర్తకు న్యాయం జరుగుతుంది.. ఇది సీఎం మాట, నా మాట, మీనాక్షి నటరాజన్ మాట. ఎవ్వరికీ కూడా 100 శాతం న్యాయం చేయలేం.. నేను వాస్తవాలు మాట్లాడతా. 70 శాతం పదవులు పాత కాంగ్రెస్ నాయకులకే దక్కేలా అధిష్ఠానం హామీ ఇచ్చింది. ములుగులో మంత్రి సీతక్క పాత నాయకులకే పదవులు ఇచ్చారు' అని తెలిపారు.సోషల్ మీడియాలో బీఆ, బీజేపీ పార్టీలు కాంగ్రెస్ పార్టీపై దుష్ప్రచారం చేస్తున్నాయని మహేశ్ మండిపడ్డారు. సోషల్ మీడియాపై కేటీఆర్ ఆశలు పెట్టుకున్నారని.. కత్తి దూసినోడు కత్తికే చనిపోతాడు అన్నట్టు కేటీఆర్‌ను సోషల్ మీడియానే ఖతం చేస్తుందని వ్యాఖ్యానించారు. పదేళ్లు చేసిన దోపిడీ, భూ దందా, అరాచక పాలనను ప్రజ లు మర్చిపోలేదన్నారు. మల్లన్నసాగర్ కట్టేటప్పుడు ఎంతమందిపై కేసులు పెట్టి జైలుకి పంపారో జనాలు మర్చిపోలేదని తెలిపారు. ప్రధాని మోదీ ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో మెదక్ ఎంపీ రఘునందన్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఉన్న ఉద్యోగాలు తీసేసిన ఘనత ప్రధాని మోదీది అంటూ విరుచుకుపడ్డారు. మోదీ హవా తగ్గిందని.. ఎప్పుడు ఎన్నికలు జరిగినా ఆయన ఇంటికి పోక తప్పదన్నారు. ప్రజలు 39 సీట్లు ఇచ్చి ప్రతిపక్ష హోదా ఇస్తే కేసీఆర్ ఫామ్ హౌస్‌కే పరిమితం అయ్యారని అన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలలో ప్రజాస్వామ్య తక్కువ న్నారు. దళితుడు రాజయ్య డిప్యూటీ సీఎంగా ఉంటే రాత్రికి రాత్రే పదవి నుంచి తొలగించారని, ఈటల రాజేందర్‌ను మెడ పట్టి గెంటేశారని మహేశ్ కుమార్ గౌడ్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.

### ఏసీబీకి పట్టుబడ్డ మరో ఇద్దరు ఉద్యోగులు

### యాదాద్రి జిల్లాలో ఘటన



**యాదాద్రిభువనగిరి :** అవినీతి అధికారులపై ఏసీబీ అధికారులు కొరడా ఝులిపిస్తున్నారు. సోమవారం ఉదయం నిర్మల్ జిల్లాలో ఇద్దరు ఏసీబీకి పట్టుబడగా యాదాద్రి జిల్లా లో మరో ఇద్దరు లంచం తీసుకుంటూ పట్టు బడారు.జిల్లాలోని ఆలేరు మండలం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న వేముగంటి పూర్ణ చందర్ రావు గ్రామ పాలనాధికారి షేక్ అహ్మద్ ఫిర్యాదుదారుడు నుంచి రూ.14 వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు దాడులు చేసి పట్టుకున్నారు.భూమి రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన వ్యవహారంలో లంచం డిమాండ్ చేయడంతో ఏసీబీ అధికారులకు ఫిర్యాదుచేశాడు. దీంతో ఏసీబీ అధికారుల సూచన మేరకు ఫిర్యాదుదారుడు లంచం ఇస్తుండగా పట్టుకుని కేసు నమోదు చేసి నాంపల్లి కోర్టులో హాజరు పరిచారు.

## మంత్రి కొండా సురేఖ వ్యవహారంపై నివేదిక సిద్ధం చేసిన క్రమశిక్షణ కమిటీ



**హైదరాబాద్ :** తెలంగాణ మంత్రి కొండా సురేఖ వ్యవహారంపై కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ నివేదిక సిద్ధం చేసింది. ఈ నివేదికను తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్‌కు ఈ కమిటీ ఇవ్వనుంది. ఈ క్రమంలోనే కొండా సురేఖపై చర్యలకు రంగం సిద్ధమైనట్లు సమాచారం.కొండా సురేఖతో పాటు మరో ఇద్దరి వ్యవహారంపై కఠిన నిర్ణయం తీసుకునేలా క్రమశిక్షణ కమిటీ సిఫారసు చేసినట్లు తెలుస్తోంది. ఈరోజు (సోమవారం) సాయంత్రం ఈ నివేదికను ఏఐసీసీకి మహేశ్ గౌడ్ పంపనున్నారు. ఆమె వివరణకు క్రమశిక్షణ కమిటీ సంతృప్తి వ్యక్తం చేయలేదని సమాచారం.కొండా సురేఖపై చర్యలు తీసుకోవాలని క్రమశిక్షణ కమిటీ సిఫారసు చేసింది. సీఎం రేవంత్‌రెడ్డిపై ఆమె కూతురు సుస్మిత ఆరోపణలు చేస్తే సహజ న్యాయ సూత్రం ప్రకారం సురేఖ ఖండించాల్సి ఉందని.. కానీ అలా చేయలేదని ఈ కమిటీ అభిప్రాయపడింది. సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వం, పార్టీపై ఎవరు తప్పుడు మాటలు మాట్లాడినా తప్పనిసరిగా చర్యలు ఉండాల్సిందేనని ఈ కమిటీ స్పష్టం చేసింది. గతంలో కొండా సురేఖను కాపాడానని, ఇక తానేమీ చేయలేనని మహేశ్ గౌడ్ ఇటీవల స్పష్టం చేసిన విషయం తెలిసిందే.

**సీఎం రేవంత్‌రెడ్డితో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క భేటీ** ఈ నేపథ్యంలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క భేటీ అయ్యారు. రాష్ట్రంలోని తాజా పరిణామాలపై ఇరువురు నేతలు ఈ సమావేశంలో చర్చిస్తున్నారు. ఇటీవల భట్టితో క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి భేటీ అయ్యారు. కొండా సురేఖ అంశంపై సీఎం రేవంత్, భట్టివిక్రమార్కచర్చించనున్నట్లు సమాచారం.

# దివ్యాంగ వధువులకు తెలంగాణ హైకోర్టు గుడ్ న్యూస్




**హైదరాబాద్:** తెలంగాణ హైకోర్టులో రాష్ట్ర ప్రభుత్వానికి స్వల్ప ఊరట లభించింది. ప్రభుత్వం అమలు చేస్తున్న కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ పథకాల కింద దివ్యాంగ వధువులకు అందిస్తున్న అదనపు సాయాన్ని కొనసాగించేందుకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో వీరికి ఈ పథకాల వర్తింపుపై విధించిన స్టేను హైకోర్టు సోమవారం ఎత్తివేసింది. దివ్యాంగులకు మినహా మిగిలిన వారికి ఈ రెండు పథకాలపై విధించిన స్టే కొనసాగుతోందని స్పష్టం చేసింది. అయితే దీనిపై వాదనలు వినిపించడానికి రాష్ట్ర ప్రభుత్వం రెండు వారాల గడువు కోరింది.ఈ పథకాల కింద సాధారణ లబ్ధిదారులతో పోలిస్తే దివ్యాంగ వధువులకు 25 శాతం అదనంగా ఆర్థిక సాయం అందించేలా గతంలో ప్రభుత్వం జీవో జారీ చేసింది. సోమవారం ఈ పథకాల అమలుపై దాఖలైన పిటిషన్లపై విచారణ జరిగింది. ఈ సందర్భంగా ప్రభుత్వం తరఫు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. దివ్యాంగుల హక్కుల చట్టం నిబంధనలకు అనుగుణంగానే ఈ ప్రత్యేక ఆర్థిక సాయాన్ని అందిస్తున్నట్లు హైకోర్టు ధర్మాసనానికి స్పష్టం చేశారు. ప్రభుత్వ వాదనలతో ధర్మాసనం ఏకీభవించింది.

దీంతో దివ్యాంగ వధువులకు ఈ పథకాల కొనసాగింపునకు ఆదేశించింది.

# కృష్ణా జలాలను నిలువునా దోచుకుంటున్న ఏపీ ప్రభుత్వం

## మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి



**హైదరాబాద్:** కృష్ణా జలాలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిలువునా దోచుకుంటోందని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆరోపించారు. తెలంగాన భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జలయజ్ఞంలో భాగంగా ప్రారంభించిన వెలిగొండ ప్రాజెక్టు. ఒకవైపు శ్రీశైలం ప్రాజెక్టులో నీటిమట్టం 854 లెవల్‌లో గేట్లు తెరిస్తే పోతిరెడ్డి పాడు, పక్కన మల్యాల, హంద్రీనీవా ఇది ఒక సిస్టమ్.. మరోవైపు అదే శ్రీశైలం ప్రాజెక్టులో 840 అడుగుల వద్దే ఒక టన్నెల్ 19.2 కిలోమీటర్ల టన్నెల్‌ను తవ్వి ముందుకు తీసుకొని పోయి రిజర్వాయర్‌ను కట్టారు. దాని పేరు నల్లమల సాగర్ అని అన్నారు.43 టీఎంసీల యూజబుల్ వాటర్ అని వాళ్లు లెక్క చెబుతున్నరు. కానీ అది 53 టీఎంసీల రిజర్వాయర్. కట్టేశారు.. టన్నెల్ అయిపోయాయి. ఇప్పుడు వెలిగొండ ప్రాజెక్టుకు సంబంధించి టన్నెల్ దగ్గర ఉండేట్వంటి అప్రోచ్ కెనాల్ అక్కడుండే గేట్లు తెరిస్తే చాలు.. శ్రీశైలం నీళ్లు 854 లెవల్ పోతిరెడ్డిపాడు అయిపోగానే.. శ్రీశైలం 854 లెవల్‌కు డౌన్ అయింది అంటే 840 లెవల్‌లో ఉండే వెలిగొండ రిజర్వాయర్ ద్వారా నీళ్లు తీసేస్తరు. నాలుగున్నర లక్షల ఎకరాల కోసం ప్రకాశం జిల్లా మార్కాపురం ఏరియా, నెల్లూరు, కడప జిల్లా కలిపి 33 మండలాల్లో నాలుగున్నర లక్షల ఎకరాలకు ఉద్దేశించిన ట్వంటి ఈ వెలిగొండ ప్రాజెక్టును ఆగస్టు 31న వాళ్లు ప్రారంభోత్సవం చేసుకోవడానికి ఏర్పాటు చేసుకుంటున్నరు. ఎక్కడ పడుకుంటున్నవ్ రేవంత్ రెడ్డి.. ఎక్కడున్నవ్ ఉత్తమ్ కుమార్ రెడ్డి.. ఏం చేస్తున్నరు మీరు. అని సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ప్రశ్నించారు.ఉన్న నీళ్లు నల్లగొండకు, పాలమూరుకు ఇయ్యనీకే చేతనైతలేదు. పాలమూరు-రంగా రెడ్డి తయారై ఉన్న సిస్టమ్‌ను ఆపరేట్ చేయ డానికి చేతనైతలేదు మీకు.. మిగిలిన పనులు పూర్తి చేయనీకి చేతనైత లేదు. అది కూడా మనం దిగువన పెట్టిన వసరు. వాళ్లకు 854 లెవల్, 840 లెవల్ వచ్చే కంటే ముందే 802 లో ఉండే సిస్టమ్‌ను వాడుకునేట్వంటి తెలివి లేని, చేతగాని అసమర్థ ప్రభుత్వం ఇదన్నారు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి. అసమర్థత ముఖ్యమంత్రి, అసమర్థ సాగునీటి మంత్రి, జిల్లా మంత్రులకు సోయే లేదు..

"VISHALA JYOOTHI" vide PRGI Registration No. "TGBIL/25/A0946" Printed by Published by DEVENDAR KUNTA on behalf of DEVENDAR KUNTA, printed atHAMARA WARANGAL PRINTERS AND GRAPHICS, H.NO: 25-8-182,BABUJI NAGAR, KAZIPET, WARANGAL, TELANGANA - 506003. and published at H.NO. 4-123/1,KUNTA WADA,RAIPARTHY, WARANGAL, TELANGANA - 506314. Editor DEVENDAR KUNTA, Cell : 9440711117.